మల్లాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు
సచివాలయం నుంచి మెటీరియల్ తరలింపు - 7లో

ఫ్లెచ్..అయినా ఫలితం సున్నా!

ఈసారి ఎన్నికల ఫలితాలు కొందరి రాజకీయ జీవితాలను మలుపు తిప్పాయి. గెలుస్తామా లేదా అన్న బెంగతో గడిపిన అభ్యర్థులను ఆకాశమంత ఎత్తున నిలబెట్టేలా ఓటర్లు తీర్పునిచ్చారు. రికార్డులు బద్దలుకొట్టే మెజారిటీలనూ అందించారు. అదే సమయంలో ఎమ్మెల్యే టిక్కెట్టు రాలేదనే అసంతృప్తితో ఆకస్మిక నిర్ణయాలు తీసుకున్న వారికి మాత్రం ఓటర్లు చెల్లుచీటీ ఇచ్చారు. కూటమిలోని టీడీపీ, జనసేన టిక్కెట్టు రాలేదనే కారణంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకున్న ఆయా పార్టీల నేతలు తీవ్రంగా నష్టపోయారు. కోనసీమలో జనసేన నుంచి చివరి క్షణంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సైతం వైసీపీలోకి వెళ్లిపోయారు. ఇది చిన్న విషయమేమీ కాదు. కానీ జనసైనికులు మాత్రం పార్టీకి దన్నుగా నిలిచి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడంతోపాటు అహర్నిశలు పనిచేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ మారిన నాయకుల భవితవ్యమే ఇప్పుడు అంధకారమైంది. అదేవిధంగా టీడీపీ నుంచి చివరి క్షణంలో వైసీపీలో చేరి ఆ పార్టీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు దారుణమైన ఓటమిని చవిచూశారు. జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది వైసీపీ పంచన చేరిన రాపాక వరప్రసాదరావు ఎంపీగా బరిలో దిగి మట్టికరిచారు. వీరేకాక వారి వెంట నడిచిన ద్వితీయ శ్రేణి నాయకుల భవితవ్యం కూడా అయోమయంగా మారిపోయింది. ఒకేఒక్కడు.. వాసంశెట్టి సుభాష్ మాత్రం పార్టీ మారిన తర్వాత టీడీపీ టిక్కెట్టు పొంది రామచంద్రపురం ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

- పార్టీలు మారినా ఫలితం దక్కని నేతలు
- ఎందుకు మారామా అని కొందరు నేతల కోనసీమ నేతల అంతర్మథనం
- టీడీపీ, జనసేన నుంచి వైసీపీలో చేరి గొల్లుమంటున్న వైనం
- మంత్రి విశ్వరూప్‌తో విభేదించిన వాసంశెట్టి సుభాష్‌ను మాత్రం వరించిన విజయం


వాసంశెట్టి సుభాష్


రాపాక వరప్రసాద్


గొల్లపల్లి సూర్యారావు


కొండేటి చిట్టిబాబు

(అమలాపురం టౌన్)

ఎన్నికల తర్వాత ఎవరు హీరో, ఎవరు జీరో అన్న కోణంలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. ఓటర్ల తీర్పుతో ఇప్పటికే అదృష్టవంతులే తేలిపోయింది. దురదృష్టవంతులెవరో కూడా ఇప్పుడు జనంలో చర్చ సాగుతోంది. ఎన్నికల్లో టిక్కెట్టు రాలేదన్న కారణంతో పార్టీ మారినా ఫలితం దక్కకపోవడంతో ఆయా పార్టీల నేతలు ఇప్పుడు బావురుమంటున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల సీట్ల పంపకాలు పూర్తయిన తర్వాత కూడా జిల్లాలో పార్టీలు మారిన వారి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్‌ను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆశించారు. చివరి నిమిషంలో ఆ స్థానాన్ని కూటమి సీట్ల సర్దుబాట్లలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. దాంతో రోజుల వ్యవధిలోనే సూర్యారావు టీడీపీని వీడి వైసీపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీకి దిగారు. ఆయన వెంట టీడీపీ కేడర్ మాత్రం వెళ్లలేదు. సీనియర్ ఐఏఎస్ అయిన దేవ వరప్రసాద్ నియోజకవర్గానికి కొత్త అయినప్పటికీ కూటమిలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమష్టి కృషితో దేవ ఘన విజయం సాధించారు. గొల్లపల్లికి ఘోర పరాభవం ఎదురైంది. గొల్లపల్లి పార్టీ మారకుండా ఉంటే అప్పటికీ ఊగిసలాటలో ఉన్న పి.గన్నవరం నియోజకవర్గంలోనైనా సీటు వచ్చేదని, ఆయన తొందరపాటు నిర్ణయంతో ఓటమిని కొని తెచ్చుకున్నారని ఆయన అభిమానులు వాపోతున్నారు. ఇక 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజోలు అసెంబ్లీ స్థానం నుంచి జనసేన తరఫున రాపాక వరప్రసాదరావు పోటీచేసి విజయం సాధించారు. రాష్ట్రంలోనే ఏకైక జనసేన ఎమ్మెల్యేగా ప్రత్యేక గుర్తింపును పొందారు. ఆ పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూనే ఆయన వైసీపీతో అంటకాగారు. చివరకు ఈసారి ఎన్నికల్లో వైసీపీ తరఫున అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా వరప్రసాదరావు పోటీచేసి ఘోర పరాజయాన్ని పొందారు. పి.గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న కొండేటి చిట్టిబాబును పక్కన పెట్టి వైసీపీ టిక్కెట్‌ను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుకు కేటాయించారు. దాంతో చిట్టిబాబు వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల్లో నోటా కంటే తక్కువగా 1,526 ఓట్లు మాత్రమే సాధించి చిట్టిబాబు పరాజయాన్ని చవిచూశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీచేసిన తోట త్రిమూర్తులు ఓటమి చెందడంతో అనంతర కాలంలో వైసీపీలో చేరారు. ఎమ్మెల్సీ పదవిని ఆ పార్టీ కట్టబెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో త్రిమూర్తులు మండపేట వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు చేతితో 44,435 ఓట్ల తేడాతో ఓటమి చెంది ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పరమట శ్యామ్‌కుమార్ టీడీపీ టిక్కెట్ ఆశించారు. ఆ టిక్కెట్‌ను అయితాబత్తుల ఆనందరావుకు కేటాయించడంతో శ్యామ్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. నియోజకవర్గంలో నోటాకు 2,133 ఓట్లు లభించగా శ్యామ్‌కు కేవలం 793 ఓట్లు మాత్రమే లభించాయి. ఇక పినిపే విశ్వరూప్‌తో విభేదించిన వాసంశెట్టి సుభాష్ కుటుంబం వైసీపీకి రాజీనామాచేసి టీడీపీలో చేరారు. ఆయనకు టీడీపీ అధినేత చంద్రబాబు రామచంద్రపురం సీటు కేటాయించారు. మాజీ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ కుమారుడు సూర్యప్రకాష్‌తో పోటీపడ్డారు. లోకల్, నాన్‌లోకల్ అంటూ ఎంత ప్రచారం చేసినా సుభాష్ విజయం సాధించారు. ఇక జనసేన టిక్కెట్ ఆశించిన పితాని బాలకృష్ణ (ముమ్మిడివరం), శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్ (అమలాపురం), బొంతు రాజేశ్వరరావు (రాజోలు)లు జనసేనకు గుడ్‌బై చెప్పి వైసీపీలో చేరారు. ఇప్పుడు వారిలోనూ అంతర్మథనం మొదలైంది.



'నోటా' లెక్కెంత?

ముమ్మిడివరం మినహా అన్ని నియోజకవర్గాల్లో మూడో స్థానంలో నిలిచిన నోటా

అమలాపురం టౌన్, జూన్ 6: నోటా ఏ అభ్యర్థి కొంప ముంచుతుందో అనుకున్నారంతా. ఎన్నికల సమయంలో ఎవరి నోట విన్నా నోటా పైనే చర్చ జరిగింది. తీరా ఎన్నికల ఫలితాలు వచ్చేసరికి ఘన విజయం సాధించిన కూటమి అభ్యర్థులందరూ బంపర్ మెజార్టీలు సాధించడంతో నోటా ప్రాధాన్యం కాస్త తగ్గింది. అయినప్పటికీ గతంలో మాదిరిగానే నోటా తన ఉనికిని మాత్రం కోల్పోలేదు. ఒక్క ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో నాల్గో స్థానంలో నిలిచిన నోటా జిల్లాలోని మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడో స్థానం దక్కించుకుంది. జాతీయ స్థాయి ప్రధాన పార్టీల కంటే నోటానే ఎక్కువగా ఓటర్లు ఆదరించారు. స్వతంత్ర అభ్యర్థులెవరూ కనీసం నోటా దరిదాపుల్లో కూడా రాలేకపోయారు. కొందరు అభ్యర్థులైతే రెండు అంకెల ఓట్లను మాత్రమే సాధించగా నోటా నాలుగు అంకెల ఓట్లు సాధించడం విశేషం. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరువాత మూడో స్థానంలో నోటా నిలిచింది. నోటాకు 1,575 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి రౌతు ఈశ్వరరావుకు 1,169, బీఎస్పీ అభ్యర్థి కాండ్రు వెంకటేశ్వరరావుకు 599 ఓట్లు లభించాయి. అత్యల్పంగా మెర్ల శాస్త్రిలకు 69 ఓట్లు లభించాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో నాల్గో స్థానంలో నిలిచిన నోటాకు 1,865 ఓట్లు లభించాయి. టీడీపీ, వైసీపీల తరువాత బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థి వాకపల్లి భీమారావు 2,782 ఓట్లు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి పాలెపు ధర్మారావుకు 1,342 ఓట్లు లభించాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరువాత మూడో స్థానంలో నిలిచిన నోటాకు 1,608 ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి మాతా రాణిసుబ్రహ్మణ్యంకు 1,206 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కోట శ్రీనివాసరావుకు 1,173 ఓట్లు లభించాయి. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన, వైసీపీ అభ్యర్థుల తర్వాత మూడో స్థానంలో నిలిచిన నోటాకు 1,628 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి సరెళ్ల ప్రసన్నకుమార్‌కు 1,404 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి పులపకూర లిలినీఆశారాణికి 1,066 ఓట్లు లభించాయి. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరువాత నోటా మూడో స్థానంలో నిలిచి 2,133 ఓట్లు సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థిని అయితాబత్తుల సుభాషిణికి 1,327 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి పొలమూరి మోహన్‌బాబుకు 1,971 ఓట్లు లభించాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో జనసేన, వైసీపీ అభ్యర్థుల తర్వాత 1,751 ఓట్లతో నోటా మూడో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి చిట్టిబాబుకు 1,526 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి కొల్లాబత్తుల సత్యనారాయణకు 1,715 ఓట్లు లభించాయి. మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరువాత 1,568 ఓట్లతో నోటా మూడో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆ పార్టీ నుంచి పోటీచేయగా 1,484 ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి గుర్రపు కొత్తియ్యకు 451 ఓట్లు లభించాయి.









అధినేతను కలిశారు!

అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యే విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన వారిని చంద్రబాబు అభినందించారు. అలాగే టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను కూడా వీరంతా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చిత్రంలో... చంద్రబాబును కలిసిన వారిలో అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావు, మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురం ఎమ్మెల్యే విజేత వాసంశెట్టి సుభాష్ - అమలాపురం/కొత్తపేట/మండపేట/ద్రాక్షారామ


అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో వెలిసిన ఫ్లెక్సీలు

ముగిసిన కోడ్.. వెలసిన ఫ్లెక్సీలు

అమలాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మార్చి 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎక్కడికక్కడ ఫ్లెక్సీల ప్రచారాలకు అడ్డుకట్ట వేశారు. జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. గురువారం సాయంత్రంతో ఎన్నికల కోడ్ ముగిసినట్టు అధికారికంగా ప్రకటించారు. కోడ్ అలా ముగియగానే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి తరఫున గెలుపొందిన అభ్యర్థుల ఫ్లెక్సీలను, హోర్డింగులను ఏర్పాటు చేసుకునే పనిలో ఆయా పార్టీల శ్రేణులు తలమునకలు అయ్యాయి. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఎంపీగా విజయం సాధించిన గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేగా గెలుపొందిన అయితాబత్తుల ఆనందరావుతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునే విధంగా ముందుగానే వాటిని సిద్ధం చేసుకున్నారు. సఖినేటిపల్లిలో దేవ వరప్రసాద్‌తో ప్రారంభించి పి.గన్నవరంలో గిడ్డి సత్యనారాయణ, అమలాపురంలో అయితాబత్తుల ఆనందరావు, గంటి హరీష్‌మాధుర్, కొత్తపేటలో బండారు సత్యానందరావు, ముమ్మిడివరంలో దాట్ల సుబ్బరాజు, మండపేటలో వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురంలో వాసంశెట్టి సుభాష్‌ల అభిమానులు వందలాదిగా ఫ్లెక్సీలను ఏర్పాటుచేస్తున్నారు. త్వరలోనే విజేతలైన వీరంతా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వారు అమరావతి నుంచి సొంత నియోజకవర్గాలకు తిరిగివచ్చే సమయంలో భారీ ఊరేగింపులు నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు.

బూత్‌ల్లో బంపర్ మెజారిటీలు

- అమలాపురంలో ఓటర్ల అసాధారణ తీర్పు
- పలు పోలింగ్ కేంద్రాల్లో వైసీపీకి అత్యల్ప ఓట్లు
- ఈదరపల్లి బూత్‌లో టీడీపీకి అత్యధికంగా 887 ఓట్లు ఆధిక్యం
- ఇక్కడ వైసీపీ అభ్యర్థి విశ్వరూప్‌కు కేవలం 72 ఓట్లే
- దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వైసీపీకి వందలోపే ఓట్లు

అమలాపురం రూరల్, జూన్ 6: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు అసాధారణ తీర్పును ఇచ్చారు. కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. వైసీపీకి పట్టున్న గ్రామాల్లో కూడా మా ఓట్లు ఏమైపోయాయంటూ ఆ పార్టీ నేతలు మనోవేదనకు గురవుతూ నిందలు మోపుతున్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలకుగాను నాలుగైదు మినహా మిగిలిన అన్ని పోలింగ్ బూత్‌లలోను టీడీపీ ఆధిక్యత కొనసాగింది. నియోజకవర్గంలో 33 పోలింగ్ బూత్‌లలో అసాధారణ స్థాయిలో టీడీపీకి అత్యధిక ఓట్లు లభించాయి. మిగిలిన పోలింగ్ బూత్‌లలో సాధారణ రీతిలో ఓట్లు లభించాయి. అత్యధికంగా ఈదరపల్లి ప్రాథమిక పాఠశాలలోని 88వ పోలింగ్ బూత్‌లో 1,031 ఓట్లు పోలవగా టీడీపీ అభ్యర్థి ఆనందరావుకు 959 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌కు కేవలం 72 ఓట్లు మాత్రమే దక్కాయి. అదేవిధంగా వివిధ పోలింగ్ బూత్‌లలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే వైసీపీకి వందలోపే ఓట్లు దక్కడం విశేషం. అమలాపురం శ్రీసర్దార్‌భగత్‌సింగ్ మున్సిపల్ పాఠశాల పోలింగ్ బూత్ నంబరు 65లో టీడీపీకి 799 ఓట్లు, వైసీపీకి 34 ఓట్లు రాగా టీడీపీ 765 ఆధిక్యత సాధించింది. కోడూరుపాడు జడ్పీ హైస్కూలు పోలింగ్ కేంద్రం నంబరు 127లో టీడీపీకి 605 ఓట్లు, వైసీపీకి 98 ఓట్లు రాగా టీడీపీ 507 ఓట్లు ఆధిక్యత సాధించింది. అల్లవరం గ్రామ సచివాలయంలో పోలింగ్ బూత్ నంబరు 132లో టీడీపీకి 511, వైసీపీకి 44 ఓట్లు లభించగా 467 ఓట్లు ఆధిక్యత సాధించారు. రాజులపాలెం పోలింగ్ కేంద్రం నంబరు 164లో టీడీపీకి 458 ఓట్లు రాగా వైసీపీకి 94 ఓట్లు లభించాయి. 364 ఓట్ల ఆధిక్యత లభించింది. ఉప్పలగుప్తం గ్రంథాలయ భవనంలోని 208 పోలింగ్ కేంద్రంలో టీడీపీకి 456 ఓట్లు, వైసీపీకి 100 ఓట్లు రాగా 356 ఓట్ల ఆధిక్యత లభించింది. చల్లపల్లి జడ్పీ హెచ్‌స్‌లోని పోలింగ్ కేంద్రం 224లో టీడీపీకి 537 ఓట్లు, వైసీపీకి 76 ఓట్లు లభించగా 461 ఓట్ల ఆధిక్యత లభించింది. అదే పాఠశాలలోని బూత్ నంబరు 225లో టీడీపీకి 663 ఓట్లు, వైసీపీకి 165 ఓట్లు లభించగా 498 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలోని పోలింగ్ బూత్ నంబరు 100లో టీడీపీకి 589 ఓట్లు, వైసీపీకి 84 ఓట్లు రాగా 505 ఓట్ల ఆధిక్యత లభించింది. రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 119లో టీడీపీకి 638 ఓట్లు రాగా వైసీపీకి 135 ఓట్లు వచ్చాయి. 503 ఓట్ల ఆధిక్యత సాధించారు. గూడాల ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 122లో టీడీపీకి 668 ఓట్లు, వైసీపీకి 83 ఓట్లు రాగా 585 ఓట్ల ఆధిక్యత లభించింది. గోడి ప్రాథమిక పాఠశాలలో బూత్ నంబరు 144లో టీడీపీకి 259 ఓట్లు, వైసీపీకి 51 ఓట్లు లభించాయి. ఇందుపల్లి జడ్పీ హెచ్‌ఎస్‌లోని బూత్ నంబరు 82లో టీడీపీకి 445 ఓట్లు, వైసీపీకి 62 ఓట్లు మాత్రమే లభించాయి. సాకుర్రు జడ్పీహెచ్‌ఎస్‌లోని బూత్ నంబరు 79లో టీడీపీకి 320 ఓట్లు, వైసీపీకి 92 ఓట్లు లభించాయి. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని బూత్ నంబరు 63లో టీడీపీకి 417 ఓట్లు, వైసీపీకి 44ఓట్లు పోలవగా 373 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం శ్రీసుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 55లో టీడీపీకి 759 ఓట్లు, వైసీపీకి 49 ఓట్లు రాగా 719 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం శ్రీసుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 56లో టీడీపీకి 502 ఓట్లు, వైసీపీకి 62 ఓట్లు రాగా 440 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం శ్రీసుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 57లో టీడీపీకి 605 ఓట్లు, వైసీపీకి 86 ఓట్లు రాగా 519 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం శ్రీసుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 58లో టీడీపీకి 581 ఓట్లు, వైసీపీకి 78 ఓట్లు రాగా 503 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం శ్రీసుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబరు 59లో టీడీపీకి 423 ఓట్లు, వైసీపీకి 95 ఓట్లు రాగా 328 ఓట్ల ఆధిక్యత లభించింది. నల్లమిల్లి సచివాలయంలో బూత్ నంబరు 15లో టీడీపీకి 613, వైసీపీకి 109 ఓట్లు లభించాయి. బండారులంక జడ్పీ హైస్కూలులోని బూత్ నంబరు 5లో టీడీపీకి 612, వైసీపీకి 193 ఓట్లు లభించాయి. జనుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో బూత్ నంబరు 18లో టీడీపీకి 879, వైసీపీకి 73 ఓట్లు లభించాయి. కొంకాపల్లిలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్కూలులోని బూత్ నంబరు 38లో టీడీపీకి 646, వైసీపీకి 104 ఓట్లు రాగా 542 ఓట్ల ఆధిక్యత లభించింది. అమలాపురం పొట్టి శ్రీరాములు మున్సిపల్ స్కూలులోని బూత్ నంబరు 40లో టీడీపీకి 462, వైసీపీకి 90 ఓట్లు రాగా 372 ఓట్ల ఆధిక్యత లభించింది. 41వ నంబరు బూత్‌లో టీడీపీకి 543 ఓట్లు, వైసీపీకి 52 ఓట్లు మాత్రమే లభించాయి. బూత్ నంబరు 50లో టీడీపీకి 615 ఓట్లు, వైసీపీకి 200 ఓట్లు రాగా 415 ఓట్ల ఆధిక్యత లభించింది. బూత్ నంబరు 51లో టీడీపీకి 642 ఓట్లు, వైసీపీకి 132 ఓట్లు రాగా 510 ఓట్ల ఆధిక్యత లభించింది. వైసీపీని కొన్ని బూత్‌లు గట్టిగానే దెబ్బతీశాయి.

వైసీపీ విధానాలే దెబ్బతీశాయా..

అమలాపురం నియోజకవర్గానికి సంబంధించి తమకు ఎక్కడ మెజారిటీ వచ్చిందో తెలుగుదేశం శ్రేణులు లెక్కలు తీస్తుంటే, వైసీపీ తమకు ఎక్కడ దారుణమైన దెబ్బతగిలిందో విశ్లేషణ చేస్తోంది. కొన్ని బూత్‌లలో ఐదారొందల నుంచి వెయ్యిలోపు ఓట్లు ఉన్నచోట తమకు 50లోపే ఓట్లు రావడంతో ఆ బూత్ పరిధిలో వైసీపీ ఓట్లు ఏమయ్యాయంటూ నివ్వెరపోతున్నారు. ఈసారి పార్టీపరంగా కాకుండా ప్రజావ్యతిరేక విధానాలకు విసిగి జనం ఓటు వేశారని చివరకు అంచనాకు వస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ చేసిన మంచికన్నా జరిగిన నష్టమే ఎక్కువనే అంచనాకి జనం ఎప్పుడో వచ్చేశారని అర్థమైంది.


అమలాపురంలో పట్టణ సీఐ క్రిస్టఫర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 6: సోషల్ మీడియాలో కులాల మధ్య గొడవలు సృష్టించేలా వివాదాస్పద పోస్టులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన వరసాల ముత్యాలరావు సోషల్ మీడియాలో ఇతర వర్గాలను రెచ్చగొట్టే విధంగా వాయిస్ మెస్సేజ్ పెట్టడంతో కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. వివాదాస్పద పోస్టులను ఫార్వార్డ్ చేయడం కూడా నేరమేనన్నారు. జిల్లాలో మొబైల్ పార్టీల పెట్రోలింగ్, పోలీసు పికెట్‌లు, పోలీసు నిఘా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. పోలీసు నిఘాను అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషాతో కలిసి పరిశీలించామన్నారు. కాగా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా అమలాపురంలో పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో పోలీసులు స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి నల్లవంతెన వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలకుండా ప్రజలకు భరోసా కల్పిస్తూ కవాతు నిర్వహించారు.

ఆ ఇంట్లో.. మూడో ఎంపీగా హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూన్ 6: గంటి మోహన్‌చంద్ర బాలయోగి పేరు వినని కోనసీమవాసి ఉండరంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన బాలయోగి దేశవ్యాప్తంగానేకాదు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపుపొందారు. ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు, వారి పిల్లలు ఎంపీలుగా ఎన్నిక కావడం అరుదు. అటువంటి ఘనతను బాలయోగి కుటుంబం దక్కించుకుంది. 1991లో బాలయోగి అమలాపురం ఎంపీగా ఎన్నికయ్యారు. 1998లో జరిగిన ఎన్నికల్లో ఆయన మరోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. లోక్‌సభ స్పీకర్ హోదాలో ఉండగానే జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో బాలయోగి మృతిచెందారు. 2002లో జరిగిన ఉప ఎన్నికల్లో బాలయోగి సతీమణి గంటి విజయకుమారి విజయం సాధించారు. ప్రస్తుతం బాలయోగి కుమారుడు హరీష్‌మాధుర్ అమలాపురం ఎంపీగా ఘన విజయం సాధించారు.

గాజుగ్లాసు 'పవర్'

అమలాపురం టౌన్, జూన్ 6: కోనసీమ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు గాజుగ్లాసు గుర్తుపై పోటీచేసి ఇతర స్వతంత్ర అభ్యర్థులకంటే అత్యధిక ఓట్లు సాధించారు. దీంతో గాజు గ్లాస్ పవర్ అలా ఉందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జైశ్రీసూర్యేంద్రనాథ్‌బాబూజీ గుత్తుల స్వతంత్ర అభ్యర్థి గాజు గ్లాసు గుర్తుతో పోటీచేసి 1,079 ఓట్లు సాధించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో అంగాడి రేవతి గాజు గ్లాసు గుర్తుతో పోటీచేసి 746 ఓట్లు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి జంగా రాజేంద్రకుమార్ అదే గుర్తుతో 795 ఓట్లు సాధించారు. ఇతర స్వతంత్ర అభ్యర్థులెవరూ రెండు అంకెల స్కోరు కూడా సాధించకపోవడం విశేషం.

పశుగ్రాసం దొరక్క మూగజీవాల విలవిల



- గ్రామాలలో ఎండుగడ్డికి ఎన్ని కష్టాలో..
- అల్లాడుతున్న పశువులు
- కొండెక్కిన గడ్డి ధరలు
- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు



సామర్లకోట, జూన్ 6: పశుగ్రాసం దొరక్క మూగజీవాల డొక్కలు ఎండుతున్నాయి. ఎండలు ముదరడంతో పచ్చగడ్డి కరువైంది. ప్రత్యామ్నాయమైన వరిగడ్డి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో సరైన పోషణ లేక పాల దిగుబడి తగ్గి పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా మారింది. కొండలు, గుట్టలు, గరువులు వంటి బీడు భూములలో మేత దొరకక పశువులు అల్లాడుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో పశు పోషకులు దూరాభారమైనా మాగాణీ ప్రాంతాలకు వెళ్లి ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. గత పాలకుల హయాంలో పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసి అటు రైతులకు, ఇటు పశు పోషకులకు గ్రాసం కొరత లేకుండా ముందుచూపుగా వ్యవహరించిందన్న పేరుందని పలువురు రైతులు చెబుతున్నారు. అంతే కాదు అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు సామర్లకోట, బిక్కవోలు రైల్వే గూడ్స్ యార్డుల ద్వారా ఎండుగడ్డిని సరఫరా చేసిన ఖ్యాతి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉందని పలువురు పశు పోషకులు నాటి మంచి రోజులను గుర్తు చేసుకోవడం గమనార్హం. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఆ దిశలో చేసిన దాఖలాలు లేవు. దీంతో ఎండుగడ్డికి గడ్డు పరిస్థితి నెలకొంది.

అధిక ధరలకు వరిగడ్డి

ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ట్రాక్టర్లలో వరిగడ్డిని సామర్లకోట తదితర ప్రాంతాలకు తెచ్చి ట్రాక్టర్ వరిగడ్డి రూ. 13 వేల నుంచి రూ. 15 వేల వరకూ ధరలు నిర్ణయించడంతో రైతులు అధిక ధరలతో కొనుగోలు చేసుకోలేక గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ధరలను నియంత్రించకుండా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినవస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి సైతం లారీలలో వరిగడ్డిని తెచ్చి లారీ వరిగడ్డిని రూ. 18 వేల నుంచి రూ. 20 వేల వరకూ విక్రయిస్తున్నారు. సామర్లకోట, పెద్దాపురం, కిర్లంపూడి, పెదపూడి తదితర ప్రాంతాలలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో పశుపోషకులు, రైతులు వరిగడ్డిని కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తిని కనబరుస్తూ వరిగడ్డి ట్రాక్టర్ల కోసం గాలింపు చర్యలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ వరిగడ్డికి కనీసం రూ. 500 కూడా తగ్గించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మేత కోసం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ పొలాల వెంబడి తిరిగినా మూగజీవాలకు సరిగ్గా మేత దొరకడం లేదని దీంతో బక్కచిక్కి పశువులు అల్లాడిపోతున్నాయని పశు పోషకులు అంటున్నారు. రాయితీలపై పశు పోషకులకు గత ప్రభుత్వ హయాంలో పశుగ్రాసం రైతులకు సరఫరా చేసేవారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వంలో పశుగ్రాసం రైతులకు రాయితీలపై సరఫరా చేసిన దాఖలాలు లేవని పలువురు పశు పోషకులు వాపోతున్నారు. ప్రభుత్వం మూగజీవాల పశుగ్రాసం విషయంలో ఎటువంటి పురోభివృద్ధి లేకపోవడం అత్యంత విచారకరం అని పలువురు ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరకే పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వరిగడ్డి అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నా అధిక ధరలను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో పశు సంపదను కాపాడేందుకు ప్రభుత్వం, అధికారులు యుద్ధ ప్రాతిపదికన రాయితీపై పశుగ్రాసాన్ని అందజేయాలని పలువురు పశు పోషకులు కోరుతున్నారు.

జీఎస్ఎల్‌లో నేడు, రేపు యుక్త శస్త్ర చికిత్స కోర్సుపై వర్క్‌షాప్

రాజానగరం, జూన్ 6: భారతదేశంలోనే తొలిసారిగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో యుక్త శస్త్ర చికిత్స (ఫండమెంట్ యూస్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ(ఫ్యూజ్) కోర్సుపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ మెడికల్ కళాశాల సర్జన్ ప్రొఫెసర్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు గురువారం తెలిపారు. అమెరికన్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్స్ సొసైటీ (ఎస్ఏజీఈఎస్), యూఎస్ఏ ద్వారా ఆమోదించబడిన ఈ ప్రాథమిక కోర్సుకు లైఫ్ టైమ్ సర్టిఫికెట్ అందిస్తుందని చెప్పారు. ఇది అన్ని విభాగాల సర్జన్లకు, సర్జరీ పీజీ విద్యార్థులకు ఒక ముఖ్యమైన విద్యా అవకాశమని అన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఫ్యూజ్ కోర్సు, శస్త్ర చికిత్సలో ఎనర్జీ ఆధారిత పరికరాల సురక్షిత వినియోగంపై ఐదుగురు అమెరికన్ సర్జన్లు సమగ్ర శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ పొందిన వారు ఎలక్ట్రో సర్జరీ ప్రాథమిక అంశాలు, ఆపరేటింగ్ రూమ్ అగ్ని ప్రమాదాలు వంటి ప్రతికూల సంఘటనలకు అవకాశాలు, నివారించే పద్ధతులు, వివిధ శస్త్ర చికిత్స విభాగాల్లో ఉపయోగించే ఎనర్జీ పరికరాలు గురించి సమగ్ర అవగాహన పొందుతారని చెప్పారు. ఇది భారతదేశంలో శస్త్ర చికిత్స విద్యలో ఒక ముఖ్యమైన పురోగతిగా నిలుస్తుందన్నారు. దీనిలో పాల్గొనే వారికి శస్త్ర చికిత్సలో ఎనర్జీ పరికరాల సురక్షిత వినియోగంపై తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి అవకాశం లభిస్తుందని, అలాగే రోగుల ఫలితాలు, శస్త్ర చికిత్స రంగాన్ని అభివృద్ధి చేస్తుందని డాక్టర్ భాస్కరరావు వివరించారు. మరిన్ని వివరాలు, నమోదు కోసం డాక్టర్ సమీర్ రంజన్‌నాయక్ 95505 21218; డాక్టర్ అన్నపూర్ణ 98854 46606, డాక్టర్ ఆనంద్ 89390 63510 నెంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు.

బిల్లు కలెక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



చెల్లాచెదురుగా కుర్చీలు

సర్పవరం జంక్షన్, జూన్ 6: కాకినాడ రూరల్ సర్పవరం గ్రామ సచివాలయంలో ఆగంతకులు కర్రలతో వచ్చి బిల్లు కలెక్టర్‌పై దాడి చేయడమే కాకుండా ఆఫీసులో ఫర్నీచర్ ధ్వంసం చేస్తూ తీవ్ర భయాందోళన సృష్టించారు. సచివాలయం-1లో బిల్లు కలెక్టర్‌గా శేషగోపాల్ విధి నిర్వహణలో ఉండగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆఫీసులోకి చొరబడ్డారు. వచ్చీ రాగానే ఎదురుగా ఉన్న బిల్లు కలెక్టర్ శేషగోపాల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడి పిడిగుద్దులు కురిపించారు. మరో వ్యక్తి కుర్చీలు విరగ్గొట్టి ఫర్నీచర్ ధ్వంసం చేశాడు. మూడో వ్యక్తి బయట నిలబడి ఈ తతంగం మొత్తం వీడియో తీస్తున్నాడు. ఏం జరిగిందో తేరుకునేలోగా దాడి చేశారు. అక్కడే ఉన్న గ్రామ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, సచివాలయం, శానిటేషన్ సిబ్బంది అడ్డుకోబోగా వీరిపై తిరగబడి కర్రలతో కొట్టేందుకు ప్రయత్నించారు. వీడియో తీయబోయిన సిబ్బందిని బెదిరించి పరారయ్యారు. బిల్లు కలెక్టర్ శేష కుమార్ తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడి చేసిన వారు ఎవరో, ఎందుకు చేశారో వివరాలు తెలియవని, వీరిని చూస్తే గుర్తుపట్టగలమని గ్రామ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, బాధితుడు శేషగోపాల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి రాగా ఆగంతకులు అప్పటికే పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

లోవ హుండీ ఆదాయం రూ.35.22 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

తునిరూరల్, జూన్ 6: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీల లెక్కింపు గురువారం చేపట్టారు. ఈ లెక్కింపునకు దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి ప్రత్యేకాధికారి పి.నారాయణ మూర్తి హాజరుకాగా ఆలయ సిబ్బంది హుండీలు తెరిచి లెక్కింపులు చేపట్టారు. 42 రోజులకుగాను రూ.35,22,980 లక్షలు ఆదాయం ఆలయానికి సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథరాజు తెలిపారు. ఈ లెక్కింపును జిల్లా సహాయ కమిషనర్ జె.సత్యనారాయణ, గ్రేడ్-2 కార్యనిర్వహణాధికారి కేవీ సురేష్‌లు పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



గొల్లప్రోలు రూరల్, జూన్ 6: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో పిడుగుపాటుకు వ్యక్తి మరణించగా పోలీసులు గురువారం గుర్తించారు. గ్రామానికి చెందిన పోసిన వీరవెంకట సత్యనారాయణ(34) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో పశువులను మేపుతూ ఉంటారు. బుధవారం సాయంత్రం ఆదే మాదిరిగా రెండు గేదెలను మేపేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఊరి చివరి చెరువు వద్ద విగత జీవిగా పడి ఉన్న సత్యనారాయణను బంధువులు, పోలీసులు గుర్తించారు. పిడుగుపాటుకు గురై మరణించినట్లు నిర్ధారించారు. గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్యనారాయణకు వివాహం కాలేదు. ఇతనికి తల్లి, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు.

ఆందోళనలో 'షెకావత్' బృందం

- వైసీపీతో అంటకాగి సాగించిన అక్రమాలకు మూల్యం తప్పదన్న వేదన
- ఇప్పటికే ప్రభుత్వం వద్ద నివేదికలకు అడ్డు నిలిచే వారి కోసం గాలింపు
- క్రమశిక్షణా చర్యలకు గురైన వారు పెదవి విప్పకుండా జాగ్రత్తలు

(ఆంధ్రజ్యోతి-నిఘా విభాగం)

మారేడుమిల్లి అడవుల్ని అడ్డాగా చేసుకుని వైసీపీతో అంటకాగిన షెకావత్ బృందం, వీరికి అండగా నిలిచిన మరికొందరు కేంద్ర సర్వీసుల అధికారులు రాష్ట్రంలో పాలన మారడంతో తమకు గడ్డు రోజులు వచ్చాయన్న ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో తాము సాగించిన అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం వద్ద నివేదికలు పెండింగ్‌లో ఉండటం, ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వంలో రాజకీయ పెద్దలు ఎవరూ లేకపోవడం, ఎన్నికలు అయ్యాక తిరిగి తమ పెద్దలే అధికారంలోకి వస్తారన్న ధీమాలో ఉన్న షెకావత్ తరహా అధికారులు, వారి బృందాలు తాజా పరిణామాలతో విస్మయానికి గురయ్యారు. చిత్తూరు జిల్లాకు చెందిన అటవీశాఖలో కీలకంగా ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధి అండతోనే స్థానిక నేతల నుంచి ఇబ్బందులు లేకుండా చేసుకుని ఇంతకాలం చక్రం తిప్పిన ఈ అధికారులు కొత్త ప్రభుత్వంతో తమకు గడ్డురోజులు వచ్చి మూల్యం చెల్లించుకోక తప్పదన్న ఆవేదనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టా భూముల్లో విలువైన కలప సంపదను సులభంగా పట్టుకుపోవడంతో పాటు, అటవీ శాఖకు చెందిన టేకు ప్లాంటేషన్లపై కూడా ఈ అక్రమార్కుల కళ్లు పడ్డాయి. ఇందుకు మారేడుమిల్లి అటవీ రేంజ్‌ను ఎంచుకున్నారు. ఈ రేంజ్ పరిధిలో 1963 కాలం నుంచి ఉన్న పురాతన టేకు ప్లాంటేషన్లు ఉండటంతో, ఇక్కడ ఏం చేసినా బయటపడే అవకాశాలు ఉండవన్న ధీమాతో వందలాదిగా టేకు చెట్లను నరికేశారు. కొన్ని తరలించుకుపోగా, కొన్నిటిని అక్కడే వదిలేశారు. ఈ బాగోతం మీడియాలో వెలుగు చూడటంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపించి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. నివేదికలపై చర్యలు తీసుకునే సమయానికి రాజకీయ పాలన లేకపోయినా, దానిపై చర్యలను తమ ప్రభుత్వం వచ్చాక చూసుకోవచ్చన్న ధీమాతో కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టేలా మాత్రం చేసుకోగలిగారు. అయితే తీరా తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం రాకపోవడంతో ఏం జరుగుతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా షెకావత్ మాటలు నమ్మి ఆయనకు అనుకూలంగా వ్యవహరించి, ఆయన భరోసాతో అడవిలో జరిగిన నష్టానికి బాధ్యులుగా తెరకెక్కి క్రమశిక్షణా చర్యలకు గురైన వారికి భరోసా సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో వారు అభద్రతకు గురై తమ ఉద్యోగాలను నిలుపుకునే లక్ష్యంతో మారేడుమిల్లి అడవిలో జరిగిన బాగోతంలో వారు అప్రోవర్లుగా మారిపోతే జరిగే పరిణామాలు ఎటు దారి తీస్తాయోనన్న ఆందోళన కూడా వారిని వెంటాడుతోంది. దీంతో వారు పెదవి విప్పకుండా మరింత భరోసా కల్పిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని కాపాడే దిశగా కొత్త ప్రభుత్వంలో సరైన వారి కోసం ఈ బృందం అధికారులు అన్వేషిస్తున్నారు.

సచివాలయం నుంచి మెటీరియల్ తరలింపు

- చీకట్లో సచివాలయ భవన మెటీరియల్ తరలించిన వైసీపీ నాయకుడు
- మెటీరియల్‌ను తరలిస్తున్న రేషన్ వాహనాన్ని అడ్డుకున్న జన సైనికులు



వాహనాన్ని అడ్డుకున్న దృశ్యం

కరప, జూన్ 6: కరప-పేపకాయపాలెం రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఒక సచివాలయ భవనం నుంచి స్థానిక వైసీపీ నాయకుడు మెటీరియల్ తరలించడం వివాదాస్పదమయ్యింది. గురువారం సాయంత్రం చీకటి పడ్డాక రేషన్ వాహనంపై గుట్టుచప్పుడు కాకుండా ఈ మెటీరియల్ పట్టుకెళ్లిపోతుండగా పలువురు జనసైనికులు అడ్డుకున్నారు. స్థానిక సూర్యవరహ లేఅవుట్ ఎదురుగా సచివాలయం-2 భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గుత్తేదారుడైన స్థానిక వైసీపీ నాయకుడు భవనంలో ఉంచిన పలు రెడీమేడ్ కిటికీలు, ఫ్రేమ్‌లను రేషన్ వాహనంలోకి ఎక్కించి తరలించుకుపోయాడు. మరో ట్రిప్పు తరలిస్తుండగా అనుమానం వచ్చిన జనసేన కార్యకర్తలు వాహనాన్ని అడ్డుకుని పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులెవరూ లేకుండా చీకట్లో మెటీరియల్‌ను ఎందుకు పట్టుకెళుతున్నారని, రేషన్ సరుకులకు వినియోగించాల్సిన వాహనంలో తరలించే అధికారం మీకెవరిచ్చారని జనసైనికులు యాళ్ల పండు, పేపకాయల అంజి, కశిలింక సతీష్ తదితరులు ప్రశ్నించారు. వాహనంలో ఎక్కించిన సరుకును దింపించి భవనంలో పెట్టించారు. ముందు పట్టుకెళ్లిన సరుకును కూడా తీసుకువచ్చి ఇక్కడ పెట్టాలని, పాడైపోతాయనే ఉద్దేశమే ఉంటే అధికారుల సమక్షంలో రేపు తీసుకెళ్లాలని జనసైనికులు పట్టుబట్టారు. దీంతో చేసేదిలేక కాంట్రాక్టర్ అనుచరుడు, రేషన్ వాహనం డ్రైవర్ అక్కడ నుంచి వెనుదిరిగారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ ఘటనాస్థలికి చేరుకుని పీవీసీ కిటికీలు, ఫ్రేమ్‌లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. ఈ సామగ్రిని తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మల్లాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం, జూన్ 6: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టినరోజును స్థానిక యర్రా గార్డెన్స్‌లో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, హోం మంత్రి నమశ్శివాయ, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, స్పీకర్ సెల్వం, పలువురు పుదుచ్చేరి ఎమ్మెల్యేలు యానాం వచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), పంతం నానాజీ (కాకినాడ రూరల్), రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి సమక్షంలో మల్లాడి భారీ కేక్ కట్ చేశారు. మల్లాడి స్వగృహంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రవచనం అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు మల్లాడి దంపతులను ఆశీర్వదించారు. వందలాదిగా అభిమానులు మల్లాడికి గజమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమావాస్య సందర్భంగా తైలాభిషేకాలు



తైలాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, జూన్ 6: కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామి వారి ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని తైలాభిషేకాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి సర్వదర్శనానికి, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,33,075 ఆదాయం వచ్చింది. అన్నదాన పథకానికి పట్టిసీమకు చెందిన సత్యనారాయణగుప్తా రూ.10,120 విరాళం ఇచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

9 పరిశోధనా ప్రాజెక్టులకు నిధుల విడుదల

జేఎన్టీయూకే, జూన్ 6: రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0లో భాగంగా కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి 9 పరిశోధనా ప్రాజెక్టులకు నిధులు విడుదలైనట్లు జేఎన్టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర రూసా ప్రాజెక్టు డైరెక్టరేట్‌కు జేఎన్టీయూకే ద్వారా రూ.93 లక్షల విలువైన 9 పరిశోధనా ప్రాజెక్టులకు వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) నివేదించగా పరిశోధన, ఆవిష్కరణ, నాణ్యతా మెరుగుదలకు మొదటి విడతలో భాగంగా రూ.40,92,000 నిధులు విడుదల కాగా ఇది మంజూరైన మొత్తంలో 44 శాతం నిధులుగా పేర్కొన్నారు. రీసెర్చ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టులకు సంబంధించి వర్సిటీకి మంజూరైన ప్రాజెక్టులకు ప్రసాదరాజు, శ్రీనివాసులు, బీటీ కృష్ణ, పద్మప్రియ, శ్రీనివాసరావు, స్వామినాయుడు, వకుళ, నీలిమాదేవీ, జయప్రసాద్ తదితరులు 9 పరిశోధనా ప్రాజెక్టులకు ప్రధాన పరిశోధకులుగా వ్యవహరిస్తారని రూసా సమన్వయకర్త స్వరూపారాణి తెలిపారు. రెండేళ్ల ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు చెప్పారు.

అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూన్ 6: భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2023 ఏడాదికి టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్రాజ్ సీఈవో ఏవీఎస్ఎన్ మూర్తి ఓ ప్రకటనలో కోరారు. 2021 నుంచి 2023 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తుకు అర్హులన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే సంస్థ విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, రూ.15 లక్షల నగదు బహుమతి అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 14వ తేదీలోపు జ్ఞిఞఐఖ్రీటచీటఙౌ.జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. సాహస కృత్యాల వివరాలతో ఈనెల 10వ తేదీ లోపు సెట్రాజ్ రమణయ్యపేట జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని, వీరి అర్హతలను పరిశీలించిన అనంతరం ఏపీ ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. వివరాల కోసం సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టీటీ ర్యాంకింగ్ పోటీలు

పెద్దాపురం, జూన్ 6 : స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 8 నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈనెల 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఏపీటీటీఏలో నమోదైన క్రీడాకారులు మాత్రమే ఈ ర్యాంకింగ్ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీలు మెన్, ఉమెన్, బాలుర విభాగాల్లో ఉంటాయన్నారు. బాలుర విభాగంలో అండర్ 19, 17, 15, 13, 11తో పాటు, మహిళ, బాలికల విభాగంలో అండర్ 19, 17, 15, 13, 11 డబుల్స్, మిక్సడ్ డబుల్స్ విభాగాల్లో జరుగుతాయన్నారు.

తిరుమల మొక్కు తీర్చుకున్న యువకులు



మొక్కు తీర్చుకున్న యువకులు

మండపేట, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు సీఎం కావాలని, మండపేట ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు నాలుగోసారి గెలుపొందాలని కోరుతూ మండలంలోని ద్వారపూడికి చెందిన నలుగురు యువకులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో టీడీపీ కార్యకర్తలు తాణంకి చంద్రశేఖర్, శివ, వెన్నెల ప్రసాద్, బీజేపీ నాయకుడు కంకటాల మురళీకృష్ణ మెట్ల మార్గంలో నడుచుకుంటూ తిరుమల వెళ్లి గురువారం శ్రీవారికి మొక్కు తీర్చుకున్నారు. స్వామి దయతోనే రాష్ట్రంలో అరాచక పాలన అంతమైందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మండపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన జోగేశ్వరరావుకు మంత్రివర్గంలో చోటు దక్కాలని కోరుకున్నామని చెప్పారు.

కౌలు రైతులపై చిన్నచూపు



- ప్రభుత్వ పథకాలకు దూరంగా..
- సాయం అందక రైతుల ఇబ్బందులు

సామర్లకోట, జూన్ 6: భూయజమానులకు పట్టం కడుతూ పాలకవర్గాలు కౌలు రైతులను మాత్రం చిన్నచూపు చూస్తున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు పలు దఫాలు ప్రకటనలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఆ పథకాలను కౌలు రైతులకు కూడా వర్తింపచేయాలని వినతులు కౌలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సాగుకోసం పలువురు కౌలు రైతులు బ్యాంకుల్లో వడ్డీలకు అప్పులు తెచ్చి అవస్థలు పడుతున్నారు. అయితే వారికి రుణమాఫీ అమలుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక వడ్డీలతో కుదేలు..

రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణ చట్టం ప్రకారం కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు పొందే హక్కు కలిగి ఉన్నారు. కాగా ఏ బ్యాంకులూ రుణాలు కౌలు రైతులకు ఇచ్చేందుకు ముందుకు రాకపోగా కౌలు రైతుల యోగక్షేమాలు చూసే వ్యవసాయాధికారులు సైతం క్షేత్రస్థాయిలో ఎటువంటి సాయం అందివ్వకపోవడంతో కౌలు రైతులు రుణాలు పొందలేని దుస్థితి ప్రతీ సీజన్‌లోనూ వెన్నాడుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో అధిక వడ్డీలకు నగదు తీసుకుని పంట సాగు చేస్తున్నారు. తీరా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయి పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో కౌలు రైతులు తలలు పట్టుకుంటున్నారు.

భూ యజమానులకే అందలం

ప్రభుత్వం ఇప్పటివరకూ కౌలు రైతులను గుర్తించకపోవడంతో వ్యవసాయపరంగా అనేక పథకాలకు వారు దూరమవుతున్నారు. రైతుబంధు పథకం భూమి ఉన్న రైతులకే ప్రభుత్వం ఇస్తుండడంతో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భూమి ఉన్న రైతులకు రైతుబంధుతో పాటు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ చేస్తున్నారు. భూమి దున్నే కౌలు రైతులకు ఆదరణ లేకపోవడం, కౌలు కూడా రెట్టింపులు కావడంతో వారి పరిస్థితి దారుణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కౌలు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కౌలు రైతులకు రుణాలు అందజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. ఇక నుంచి ప్రభుత్వం కౌలు రైతులకు అందజేస్తున్న సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పంట రుణాలను అందజేయాలని, రుణమాఫీలో కౌలు రైతులను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు కౌలు రైతులు వేడుకుంటున్నారు.

రైతు బీమా వర్తింపజేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. కౌలు రైతులకు రుణాలు అందించాలి. రైతు బీమా అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కౌలు రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

తలారి పోతురాజు, కౌలు రైతు, హుస్సేన్‌పురం, సామర్లకోట మండలం

భక్తిభావంతో ముందుకు సాగాలి

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు

ఆలమూరు, జూన్ 6: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ముందుకు సాగితే ముక్తిమార్గం లభిస్తుందని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో దాస సాహిత్య భక్తి మండలి శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాస సాహిత్యంతో పురందరదాసు సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా ఎన్నో గొప్ప గీతాలను రచించారని, వాటిని ఆలపించే భాగ్యం మనకి దక్కిందని చెప్పారు. భక్తి మండలి సభ్యులు గీతాలను ఆలపించే విధానం, భక్తిభావంతో ఏ విధంగా మెలగాలి అన్న విషయాలను ఆనందతీర్థాచార్యులు వివరించారు. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి, గుమ్మిలేరు గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో వేంకటేశ్వరస్వామి గీతాలను ఆలపిస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు.

16న తిరుపతిలో కవితోత్సవం

అంతర్వేది, జూన్ 6: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఈ నెల 16న అంతర్జాతీయ సాహితీ సంస్థ, శ్రీశ్రీ కళా వేదిక డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్-కల్చరల్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో కవితోత్సవం పేరిట జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు. 165 మంది కవులు పాల్గొంటారన్నారు.



పెచ్చెట్టి చంద్రమౌళిని సన్మానిస్తున్న నాయకులు

'రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం'

అమలాపురం రూరల్, జూన్ 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పేర్కొన్నారు. ఓటు అనే ఆయుధంతో జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించడంతో టీడీపీ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి ఆకుమర్తి రమేష్ ఆధ్వర్యంలో పేరూరు ఇందిరా కాలనీలో గురువారం సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమౌళి మాట్లాడుతూ కూటమి విజయానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేసిన కృషిని ప్రశంసించారు. విజయోత్సవ కేక్ కట్‌చేశారు. చంద్రమౌళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మంధా ఫణికుమార్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి ఆశీర్వాదం, దేవరపల్లి వీరేష్‌కుమార్, జల్లి శ్రీనివాస్, ఈతకోట నాగేశ్వరరావు, మంద గెద్దయ్య, నేదునూరి నతానియేలు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న మనోహర్

ప్రాంగణ ఎంపికల్లో 68 మందికి ఉద్యోగాలు

అమలాపురం టౌన్, జూన్ 6: అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో గురువారం సినర్జింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నల్లా సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 327 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ వెన్నా నవమణికంఠ రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. సినర్జింగ్ కంపెనీలో క్యూసీ, ఆర్డీలలో పనిచేసేందుకు 68 మందిని ఎంపిక చేసి ప్రిన్సిపల్ కేఎస్‌వీఎస్ మనోహర్, ఎన్.దినేష్‌నాగ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఒక్కొక్కరికీ వార్షిక వేతనంగా రూ.3.20 లక్షలు అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, మల్లిపూడి విజయలక్ష్మి, కె.శ్రావణ్‌దిలీప్, వై.వరప్రసాద్, నల్లా పవన్‌కుమార్ అభినందించారు.



క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు

అమలాపురం టౌన్, జూన్ 6: మెట్ల రామమూర్తి-సరస్వతి మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణా తరగతులను దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్స్ క్లబ్‌లో డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు స్పోర్ట్ డ్రెస్సులను మెట్రోకెమ్ అధినేత నండెపు బాలాజీ అందించారు. కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 90 మందికి అందజేశారు. కార్యక్రమంలో రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, రంగమణి, కల్వకొలను బాబు, రంకిరెడ్డి ప్రసాద్, కోచ్‌లు బాలు, సతీష్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

కపిలేశ్వరపురం, జూన్ 6: గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో అంగర శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అభినందన సభను గురువారం నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ వాకా దివ్యశేఖర్, డైరెక్టర్ వాకా పరమేశ్వర, కరస్పాండెంట్ డాక్టర్ వాకా రాజా, ప్రిన్సిపల్ పి.రమణ అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాడపల్లిలో పుష్కరిణి పనుల పరిశీలన

ఆత్రేయపురం, జూన్ 6: కోనసీమ తిరుమల వాడపల్లిలో రూ.2కోట్లతో చేపట్టిన పుష్కరిణి పనులను గురువారం దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారుల బృందం పరిశీలించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గేష్, ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తదితరులు ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణ పనులను త్వరితగతిన చేపడతామని చెప్పారు.

'కొబ్బరిని ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి'

అంబాజీపేట, జూన్ 6: కొబ్బరిని ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు డైరెక్టర్ డాక్టర్ కుమార్‌వేల్ కోరారు. గురువారం స్థానిక ఉద్యానవన పరిశోధనా కేంద్రంలో కొబ్బరి రైతు సంఘాలతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్‌వేల్ కొబ్బరిలో ఎరువులు, యజమాన్యం వివిధ పథకాలను వివరించారు. తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త బి.నీరజ, ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ జోనల్ మేనేజరు ఆర్‌జే మూర్తి, ఉద్యానవన శాఖాధికారి దిలీప్, రైతులు పాల్గొన్నారు.

లతా ఎలక్ట్రికల్స్ శ్రీను మృతి



మలికిపురం, జూన్ 6: మలికిపురంలో ప్రముఖ ఎలక్ట్రికల్ వ్యాపారస్తుడు దివ్వి శ్రీను (56) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన 35 సంవత్సరాలుగా లతా ఎలక్ట్రికల్స్ పేరిట ఇక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శ్రీను మృతికి మలికిపురం చాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపం తెలిపింది. అప్పనరామునికలంకకు చెందిన పలువురు శ్రీను మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	మనమే
శ్రీలలిత	రక్షణ
శేఖర్ స్క్రీన్-1	ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	బ్యాడ్ బాయ్స్
రమా	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	భజే వాయువేగం

బాధితుడికి పరామర్శ

రాయవరం, జూన్ 6: ఇటీవల ప్రమాదశాత్తు గాయపడిన పసలపూడి గ్రామానికి చెందిన దూళి విజయకుమార్‌ను జనసేన మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ గురువారం పరామర్శించారు. పార్టీ తరపున అతడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జనసైనికులు శివ, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.45 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,45,520 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.





వరప్రసాద్‌కు స్వీటు తినిపిస్తున్న ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు పెద్దబ్బులు, వరప్రసాద్‌ను సన్మానిస్తున్న రాజోలు ఎంపీపీ కేతా శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు

రాజోలు ఎమ్మెల్యే విజేత వరప్రసాద్‌కి అభినందనల వెల్లువ

మలికిపురం, జూన్ 6: రాజోలు ఎమ్మెల్యేగా 39వేల మెజార్టీతో విజయం సాధించిన దేవ వరప్రసాద్‌ను ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సన్మానించారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు పెద్దబ్బులు తన కుటుంబ సభ్యులతో కలిసి దేవకు స్వీటు తినిపించారు. యానిమేటర్లు, ఉపాధ్యాయ సంఘాలు కలిసి అభినందించాయి. పలు సామాజికవర్గాల నాయకులు కూడా అభినందించారు. ఆత్మ మాజీ ఛైర్మన్ అడబాల సాయిబాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, అనుచూరి పురుషోత్తం, ముప్పర్తి నాని, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు మాలే శ్రీనివాస నగేష్, కాపిశెట్టి కనకేశ్వరరావు, అడబాల సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, గుండుబోగుల పెదకాపు, రావూరి నాగు, పుప్పల రమేష్, భూపతిరాజు ఈశ్వరవర్మ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్‌ను రాజోలు ఎంపీపీ కేతా శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు మలికిపురంలో కలుసుకుని దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివకోటి ముసలమ్మ తల్లికి మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు

రాజోలు: చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, దేవ వరప్రసాద్ రాజోలు ఎమ్మెల్యేగా గెలుపొందాలని, గంటి హరీష్‌మాధుర్ అమలాపురం ఎంపీగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని టీడీపీ శివకోటి గ్రామ శాఖ అధ్యక్షుడు కడలి ఏడుకొండలు మొక్కుకున్నారు. ఈ మేరకు గురువారం శివకోటి గ్రామ దేవత పుంతలో ముసలమ్మ తల్లికి 158 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. కార్యక్రమంలో టీడీపీ రాజోలు మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, కసుకుర్తి త్రినాథస్వామి, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, ఆరుమిల్లి భానుసుధాకర్, మామిడిశెట్టి ఏసుబాబు, పినిశెట్టి బుజ్జి, కడలి కపిల్ పాల్గొన్నారు.

రాజోలు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తా: దేవ

మలికిపురం, జూన్ 6: రాజోలు ఎమ్మెల్యేగా తనకు భారీ మెజారిటీ చేకూర్చిన నియోజకవర్గ ఓటర్లకు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మంచినీటి ఎద్దడిని నివారణకు కృషి చేస్తానన్నారు. రోడ్లు, డ్రైన్లు, ఏటిగట్ల సమస్యలను పరిష్కరిస్తాన న్నారు. సఖినేటిపల్లి-నర్సాపురం వంతెన నిర్మాణంతో పాటు అంతర్వేదిలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధిచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. 35 సంవత్సరాల పాటు ఐఏఎస్‌గా పనిచేసిన అనుభవంతో జిల్లా అధికారులను సమన్వయం చేసుకుని నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తానన్నారు.



జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న ఎంపీడీవో త్రిశూలపాణి, కార్యదర్శులు

'కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి'

పి.గన్నవరం, జూన్ 6: ప్రజాసేవే లక్ష్యంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముందుకు వెళ్తున్నారని, కూటమితోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన్ను పార్టీ కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలిసి పూలమాలలు వేసి అభినందించారు. కేక్‌లు కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యం, వీర మహిళ జిల్లా నాయకురాలు కడలి ఈశ్వరి, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరావు, మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, మాజీ ఎంపీపీలు త్సల్లా బిందుమాధవరావు, అంబటి భూలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, ఉండ్రాజవరపు శాంతకుమారి, పప్పుల సాయిబాబు, కొక్కిరి లక్ష్మి, పులపర్తి చినవెంకటలక్ష్మి, సర్పంచ్‌లు పసలపూడి రామకృష్ణ, గుడాల రాముడు, జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, డొమ్మేటి సాయికృష్ణ, చిట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సాయంత్రం ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, వివిధ గ్రామాల కార్యదర్శులు, పలువురు అధికారులు కూడా గిడ్డి సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

అంబాజీపేట: పి.గన్నవరం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన గిడ్డి సత్యనారాయణను గురువారం పలువురు నేతలు కలిసి అభినందించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గణపతి వీరరాఘవులు, జనసేన నాయకుడు మైపాల తాతాజీ, నాయకులు రేవు శ్రీను, సలాది బాబురావు, పుల్లయ్యనాయుడు, రవణం రాము తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజేత సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న అంబాజీపేట మండల కూటమి నాయకులు

'వరప్రసాద్‌కు మంత్రివర్గంలో చోటు కేటాయించాలి'

మామిడికుదురు, జూన్ 6: రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలుపొందిన దేవ వరప్రసాద్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మామిడికుదురులో ఈలి రాంబాబు స్వగృహం వద్ద గురువారం నాయకుల సమావేశం జరిగింది. జనసేనకు ఆది నుంచీ కంచుకోటగా నిలుస్తున్న రాజోలు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వరప్రసాద్ విజయానికి కృషి చేసిన కూటమి నాయకులు, శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. నేతలు దొడ్డా జయరామ్, యింటి మహేంద్ర,రుద్ర శ్రీనివాస్, కాట్రేనిపాడు నాగేంద్ర, కటకంశెట్టి రామకృష్ణప్రసాద్, పెసంగి కనకరాజు, తుమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను చంద్రబాబు నెరవేర్చాలి'

మండపేట, జూన్ 6: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడు కూటమి తరపున ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా తేవాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్య, వైద్య రంగాలపై చంద్రబాబు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మండపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన వేగుళ్ల జోగేశ్వరరావుకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు.

మగటపల్లిలో బంగారం చోరీ

మామిడికుదురు, జూన్ 6: మండలంలోని మగటపల్లిలో ఈ నెల 4వ తేదీ రాత్రి జరిగిన బంగారం చోరీపై కేసు నమోదు చేశామని నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉద్దగిరి నాగశ్రీరామమూర్తి ఇంట్లో తలుపులు వేసుకుని నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. పక్కన పెట్టిన తాళాలతో బీరువాను తెరిచి అందులో ఉన్న ఐదు కాసులు బరువు గల నల్లపూసలు, రెండు ఉంగరాలు, ఆంజనేయస్వామి బిళ్ల, బ్రాస్‌లెట్, రూపులను చోరీ చేశారు. బంగారు వస్తువుల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.



సుబ్బరాజుకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు, నాయకులు

సుబ్బరాజుకు శుభాకాంక్షలు

ముమ్మిడివరం, జూన్ 6: ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజుకు పలువురు అభినందనలు తెలిపారు. గురువారం మురమళ్లలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లి సుబ్బరాజుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నీతివంతమైన పాలన సాగించి ప్రజా శ్రేయస్సుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు చింతపల్లి అజయ్‌కుమార్, అడపా ప్రసాద్, నండెపు చినవెంకటేశ్వరరావు, కుంచే శ్రీను, దాసరి సత్యనారాయణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, నాయకులు పాయసం చిన్నీ, యేడిద రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం మురమళ్లలోని టీడీపీ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజును కలిసి అభినందించారు. వెంట్రు సుధీర్, భీమవరపు శ్రీనివాస్, భీమవరపు దుర్గబాబు, మెండి రాజశేఖర్, కాశి నరేష్‌బాబు, కాశి జ్యోతిబాబు, కొవ్వూరి శ్రీనివాసరాజు, సాపే రూప, వెంట్రు భాస్కరరామిరెడ్డి, వాసంశెట్టి సుబ్రహ్మణ్యం, కడలి నాగరాజు, ఎలిపే బాలాజీ, మోకా సూర్యప్రకాష్ ఉన్నారు.

ఎమ్మెల్యే విజేత సుభాష్ తండ్రి కృతజ్ఞతా పర్యటన



రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 6: రామచంద్రపురం ఎమ్మెల్యే విజేత వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం నియోజకవర్గంలో కృతజ్ఞతా పర్యటన చేపట్టారు. బుధవారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎస్ఆర్‌కే రాజగోపాల్‌బాబును, గురువారం ఏఎంసీ మాజీ ఛైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణలను కలిసి తన కుమారుడి విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా సుభాష్ తండ్రి సత్యంను పలువురు నాయకులు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి వేడుక జరుపుకున్నారు.

టీడీపీ నేతల సంబరాలు

అల్లవరం, జూన్ 6: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయంతో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. గోడిలంకలో గోగులమ్మ అమ్మవారి విగ్రహానికి పాలభిషేకం చేసి భారీ కేక్ కట్ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో వేగిరాజు సుబ్బరాజు, సయ్యపురాజు నరేంద్రరాజు, కడలి వెంకటేశ్వరరావు, రుద్రరాజు బాబు, ఆర్.సురేష్‌రాజు పాల్గొన్నారు. టీడీపీ దివంగత నేత అల్లూరి సత్తిబాబురాజు చిత్రపటానికి పాలభిషేకం చేసి నివాళులర్పించారు. యెంట్రుకోన వేములమ్మ గుడి వద్ద టీడీపీ, జనసేన నాయకులు కేక్ కట్ చేశారు. వర్రే సూరిబాబు, నార్గన శ్రీను, గెద్దాడ శ్రీను, తోలేటి సాగర్‌కుమార్, మొల్లేటి జయరాం పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఉప్పలగుప్తం, జూన్ 6: రాష్ట్రంలో కూటమి విజయంపై ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన గురువారం ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అమలాపురం ఎమ్మెల్యేగా అయితాబత్తుల ఆనందరావు, ఎంపీగా హరీష్‌మాధుర్ విజయంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆనందరావుకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని చంద్రబాబును కోరారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వంగలపూడి నరసింహమూర్తి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, పలివెల రాంబాబు, లూటుకుర్తి చిన్న, మోకాటి రామూర్తి, తొత్తరమూడి విజయ్, వంగలపూడి ప్రవీణ్, తవిటికి రమేష్, వంగలపూడి సతీష్, ఉందుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ముమ్మిడివరం, జూన్ 6: మండలంలోని చినకొత్తలంక గ్రామానికి చెందిన నక్కా మావుళ్లమ్మ ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 4న మావుళ్లమ్మ పని కోసం వెళుతుండగా మా అభ్యర్థికి ఓటు వేయమంటే వేయలేదు.. అయినా మేమే విజయం సాధించామంటూ అదే గ్రామానికి పొత్తూరి సుబ్బరాజు భౌతిక దాడికి దిగాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఊరేగింపు ట్రాక్టర్ కిందకు నెట్టివేశాడు. గాయపడిన తనను కుమారుడు బాలకృష్ణ ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించాడని పోలీసులకు ఇచ్చిన మావుళ్లమ్మ ఫిర్యాదులో పేర్కొంది. తనపై దాడికి దిగి గాయపరిచి కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



హరీష్‌మాధుర్‌కు మల్లాడి అభినందన

అమలాపురం టౌన్, జూన్ 6: పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్ ఆయన స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీగా ఘన విజయం సాధించిన హరీష్‌మాధుర్‌కు కృష్ణారావు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిప్పల యామినీపద్మప్రియ-నరేష్‌కుమార్, పోతాబత్తుల రాంబాబు, ఏవీవీ సత్యనారాయణ, కోలా నరసింహస్వామి, వై.చంద్రశేఖర్, సి.రమణమూర్తి, లంకే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిలో కలెక్టర్ పూజలు


అంతర్వేది, జూన్ 6: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం విచ్చేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయనకు వేద పండితులుమహదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను కలెక్టర్ శుక్లాకు ఆలయ సహాయ కమిషనరుకు సత్యనారాయణ అందించారు.

గుంటూరు ఎంపీ విజేతకు అభినందన



కె.గంగవరం, జూన్ 6: గుంటూరు ఎంపీ విజేత పెమ్మ సాని చంద్రశేఖర్‌ను టీడీపీ మండల నాయకుడు కొత్తపల్లి మురార్జీ గురువారం గుంటూరులో కలిసారు. ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా తాటమ్మ తల్లి తీర్థం



పి.గన్నవరం, జూన్ 6: పి.గన్నవరం గ్రామ దేవత తాటమ్మ తల్లి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. గత 15 రోజులుగా అమ్మవారికి వివిధ సామాజికవర్గాల వారు సేవలు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలతో అమ్మవారికి జాగరణ జరిపి నైవేద్యాలు పి.గన్నవరం, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ముత్యాలమ్మవారి తీర్థం



కె.గంగవరం, జూన్ 6: కె.గంగవరం గ్రామ దేవత ముత్యాలమ్మ తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జాతర జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రతిభా పురస్కారాలు

పి.గన్నవరం, జూన్ 6: ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నరేంద్రపురం శివారు గుత్తులవారిపాలెం మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. నరేంద్రపురం గురుకుల పాఠశాల, సాయితేజ జూనియర్ కళాశాల, గ్రేస్ డిగ్రీ కళాశాలలకు చెందిన 25 మంది విద్యార్థులకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, స్థానిక నాయకులు మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.హెలీనా, జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్, విశ్రాంత ఎంపీడీవో ఐఈ కుమార్, సాయితేజ విద్యా సంస్థల అధినేత అన్నాబత్తుల హనుమాన్, సంస్థ గౌరవాధ్యక్షుడు నల్లా పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

'పరిపాలనాదక్షునికే పట్టాభిషేకం'

రాజోలు, జూన్ 6: పరిపాలనాదక్షుడైన నారా చంద్రబాబునాయుడికే తెలుగు ప్రజలు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పట్టాభిషేకం చేశారని రాష్ట్ర హార్టీకల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన తాటిపాకలో విలేకరులతో మాట్లాడుతూ సంపద సృష్టించి ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో చంద్రబాబుకు సాటి ఎవరూ లేరన్నారు. కూటమిగా ఏర్పడడానికి విశేష కృషి చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రశంసనీయుడని కొనియాడారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, చింతా లక్ష్మి, గుండాబత్తుల తాతాజీ, కట్టా సూరిబాబు, ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, మండేల శ్రీను, ఉల్లంపర్తి దర్శనం తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి విద్యార్థికి జాతీయ ఉపకార వేతనం

ఉప్పలగుప్తం, జూన్ 6: మునిపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థి రాయుడు చంద్రవంశీ ఎన్ఎన్ఎంఎస్‌కు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు యాగా ఏడుకొండలు తెలిపారు. వంశీని ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం, జూన్ 6: మండలంలోని ఊబలంక సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఊబలంక పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

'ఉపాధి' వేతనాలు చెల్లించాలి

మలికిపురం, జూన్ 6: ఉపాధి వేతన బకాయిలను ఖాతాల్లోకి తక్షణం జమ చేయాలని ఉపాధి కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. కూలీలకు నాలుగు వారాలు వేతన బకాయిలు అందించాల్సి ఉందని, ప్రస్తుతం ఐదో వారం పని జరుగుతోందని ఉపాధికూలీల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు.